క్లుప్తంగా

కేజీబీవీ ఆకస్మిక తనిఖీ

కురబలకోట: మండలంలోని ముదివేడు సమీపంలోని కేజీబీవీని విద్యాశాఖాధికారి శివప్రకాష్ రెడ్డి ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఇటీవల పాఠశాలలో నెలకొన్న తాగునీటి సమస్యలను పరిష్కరించాలని ప్రిన్సిపాల్ ధనలక్ష్మి, విద్యాశాఖాదికారిని కోరారు. శనివారం కేజీబీవీ పర్యటనకు వచ్చిన డీఈఓను బోరు చెడిపోయి తాగునీటి సమస్యతో ఇబ్బందులు పడుతున్నామని వెంటనే పరిష్కరించాలని ప్రిన్సిపాల్ కోరారు. అనంతరం ఆయన వసతి సౌకర్యాలను పరిశీలించి.. విద్యార్థుల అభ్యసన స్థాయిలను అడిగి తెలుసుకున్నారు.

పీఎం కిసాన్ నిధులు విడుదల

నిమ్మనపల్లె: మండలంలోని 10 పంచాయతీల రైతులకు శనివారం రూ. 1.28 కోట్ల రూపాయల పీఎం కిసాన్ నిధులు కేంద్ర ప్రభుత్వం విడుదల చేసినట్లు మండల వ్యవసాయ అధికారి మురళీమోహన్ తెలిపారు. పీఎం కిసాన్ నిధులలో భాగంగా, ఒక్కొక్క రైతుకు రూ. 2 వేల చొప్పున రైతుల బ్యాంకు ఖాతాలలో జమ చేసినట్లు చెప్పారు. రైతులు తమ వ్యవసాయ అవసరాలకు ఈ నిధులు వినియోగించుకోవాలని కోరారు.

లింగనిర్ధారణ నేరం



మాట్లాడుతున్న జిల్లా నోడల్ ఆఫీసర్ ఉషశ్రీ

పీలేరు రూరల్ : లింగనిర్ధారణ పరీక్షలు చేసి ఆడబిడ్డ, మగబిడ్డ చెప్పడం చట్టరీత్యా నేరమని జిల్లా నోడల్ ఆఫీసర్ ఉషశ్రీ అన్నారు. శనివారం స్థానిక ఏరియా ఆస్పత్రిలో ప్రభుత్వ, ప్రైవేట్ స్కానింగ్ సెంటర్ల నిర్వాహకులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ స్కానింగ్ సెంటర్ల నిబంధనల మేరకు జిల్లా ఆథారిటీ వద్ద తప్పకుండా రిజిస్ట్రేషన్ చేయించుకోవాలన్నారు. ఏవైనా అడ్రస్సులు, పేర్లు, యాజమాన్యం మార్పులు చేయాలంటే జిల్లా అథారిటీకి తెలిపి అనుమతి పొందాలని పేర్కొన్నారు. నిబంధనలు అతిక్రమించే స్కానింగ్ సెంటర్లు సీజ్ చేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో ప్రోగ్రాం అధికారి దేవశిరోమణి, సూపరింటెండెంట్ డాక్టర్ చంద్రశేఖర్, డాక్టర్ సర్వతి, హెచ్ఈలు ఉషారాణి, రాజగోపాల్ పాల్గొన్నారు.

ముగిసిన పవిత్రోత్సవాలు

గుర్రంకొండ: మండలంలోని తరిగొండ గ్రామంలో వెలసిన శ్రీ లక్ష్మీనరసింహస్వామి ఆలయంలో మూడు రోజులుగా నిర్వహిస్తున్న పవిత్రోత్సవాలు శనివారంతో ముగిశాయి. శనివారం పవిత్ర ఉత్సవాలు ముగింపులో భాగంగా ఉదయాన్నే స్వామివారికి మహాపూర్ణాహుతి కావించారు. అనంతరం రంగురంగుల పుష్పాలతో అలంకరించిన వాహనంలో స్వామివారు కొలువుదీర్చి గ్రామంలో మేళతాళాలతో తిరువీధి ఉత్సవం నిర్వహించారు.

రాష్ట్ర స్థాయి పోటీలకు శిక్షణ

కలకడ : రాష్ట్ర స్థాయి హ్యాండ్‌బాల్ అండర్-17 బాలుర జట్టుకు అన్నమయ్య జిల్లా కలకడ మండలం, కోన జిల్లా పరిషత్ ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో శిక్షణ కార్యక్రమాన్ని ఆపాఠశాల ప్రధానోపాధ్యాయుడు చంగల్‌రాయుడు శనివారం ప్రారంభించారు. రాష్ట్రస్థాయి హ్యాండ్‌బాల్ క్రీడకు ఎంపికైన 20 మంది క్రీడాకారులకు చెంగల్‌రాయుడు తన సొంత నిధులు రూ.12వేలు ఖర్చుచేసి యూనిఫాం వితరణ చేసి అందజేశారు. మదనపల్లె బీటీ కళాశాలలో ఎంపికైన ఉమ్మడి చిత్తూరు జిల్లాలోని 20 మంది క్రీడాలకు ఫిజికల్ డైరెక్టర్ ఝాన్సీరాణి ఉచితంగా శిక్షణ, భోజనం వసతి కల్పించారు.

తాగునీటి సరఫరాకు ప్రాధాన్యత



సమ్మర్‌స్టోరేజ్ పంపింగ్ పరిశీలిస్తున్న ఈఓ గురుమోహన్

పీలేరు : పీలేరు పట్టణ ప్రజలకు స్వచ్ఛమైన తాగునీరు సరఫరా చేయడానికి ప్రాధాన్యత ఇస్తున్నట్లు పంచాయతీ ఈఓ గురుమోహన్ అన్నారు. శనివారం స్థానిక కొత్తపల్లె మార్గంలోని సమ్మర్ స్టోరేజ్‌ను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సమ్మర్ స్టోరేజ్‌లో నీటిని శుద్ధి చేయడానికి సిలికాన్ ఇసుక అవసరముందని, త్వరలో తెప్పించి శుద్ధి చేయనున్నట్లు తెలిపారు. తాగునీటి పైపులైన్లు, గేటు వాల్వులు ఎప్పటికప్పుడు మరమ్మతులు చేపించి నీటిని సరఫరా చేస్తామని చెప్పారు.

రాజకీయ ఒత్తిళ్లు మానుకోవాలి

కేవీపల్లె : మండలంలోని తిమ్మాపురం గ్రామ సంఘమిత్రపై రాజకీయ ఒత్తిళ్లు మానుకోవాలని సీపీఐ నియోజకవర్గ కార్యదర్శి టి.ఎల్.వెంకటేష్ అన్నారు. శనివారం ఆయన మాట్లాడుతూ ఐదు నెలలుగా తిమ్మాపురంలో వీఓ మీటింగ్ జరగకపోవడంతో సభ్యులు ఇబ్బంది పడుతున్నారని తెలిపారు. ప్రభుత్వ నిబంధనలకు వ్యతిరేకంగా వీఓ వ్యవహరిస్తున్నారని ఆరోపించారు. వీఓ పరిధిలో 40 గ్రూపులు ఉన్నాయని, గ్రూపుల్లో అవకతవకలు జరిగి ఉంటే చట్టపరమైన చర్యలు తీసుకోవాలే తప్ప రాజకీయ ఒత్తిళ్లతో అన్ని గ్రూపులను ఇబ్బంది పెట్టించడం ఏమిటని ప్రశ్నించారు.

● తంబళ్లపల్లె మండలం కోసువారిపల్లె పంచాయతీ దిగువ ముత్రవారిపల్లెకు చెందిన చలపతి, రెడ్డమ్మ కుమారుడు ధనరాజ్ (17) మదనపల్లెలో ఓ ప్రైవేటు ఐటీఐ కాలేజీలో చదువుతున్నాడు. సెప్టెంబర్ 9న గ్రామంలో వినాయక నిమజ్జనం జరుగుతుండగా తల్లిదండ్రులు వెళ్ల వద్దని చెప్పినా వెళ్లడంతో తల్లిదండ్రులు మందలించారు. దీంతో ధనరాజ్ పురుగుల మందు తాగి ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డాడు. గమనించిన కుటుంబసభ్యులు ఆస్పత్రికి తీసుకెళ్లి చికిత్స చేయించినా పరిస్థితి విషమించడంతో మృతి చెందాడు.

● మదనపల్లె పట్టణం ఈశ్వరమ్మకాలనీకి చెందిన కిషోర్(28) బెంగుళూరులో సాఫ్ట్‌వేర్ ఉద్యోగి. ఇతనికి సంస్థలో జీతం తగ్గించారని మనోవేదనతో ఇంటికి వచ్చి ఆత్మహత్య చేసుకున్నాడు.

● కురబలకోట మండలం ముదివేడు పంచాయతీకి చెందిన వెంకటరమణ (30) ఆటో డ్రైవర్. ఆటో ఫైనాన్స్‌లో తెచ్చుకున్నాడు. కంతులు కట్టలేకపోవడం, ఫైనాన్స్‌ల ఒత్తిళ్లకు తాళలేక పురుగుల మందు తాగి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. దీంతో వెంకటరమణ కుటుంబం జీవనాధరం కోల్పోయింది .

● కురబలకోట మండలం రామిగానిపల్లెకు చెందిన నవీన్‌కుమార్ (19) తిరుపతిలో బీటెక్ చదువుతున్నాడు. తాను చదవలేకపోతున్నానని, ఒత్తిడికి గురవుతున్నానని ఫోన్‌లో తల్లిదండ్రులకు చెప్పి మదనపల్లె సమీపంలోని సీటీఎం రైల్వేస్టేషన్ వద్ద చింతచెట్టుకు ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు.

క్షణం ఆలోచించు.. చిరకాలం జీవించు

● చిన్న కారణాలకే బలవన్మరణాలు
● ఒంటరవుతున్న పిల్లలు, తల్లిదండ్రులు



మదనపల్లె సిటీ: జీవితంలో ఎన్నో ఒడిదుడుకులను ఎదుర్కొన్న వారు కూడా క్షణికావేశంలో బలవన్మరణానికి పాల్పడుతున్నారు. వారి చర్యలతో ఆయా కుటుంబాలు పెద్దదిక్కును కోల్పోయి ఇబ్బందులు పడుతున్నాయి. ఇంటి యజమాని ఆత్మహత్యకు పాల్పడితే ఆ ఇల్లాలు ఇబ్బంది పడాల్సి వస్తోంది. పెద్దదిక్కు లేని ఆ కుటుంబంపై తీవ్రప్రభావం చూపుతుంది. ఓ వ్యక్తి ఆత్మహత్య ఆ కుటుంబంలో తీరని క్షోభను మిగులుస్తుంది. ఒక్కోసారి కుటుంబమే చిన్నాభిన్నమయ్యే పరిస్థితులకు దారి తీస్తుంది. జిల్లాలో ఏటా సుమారు 200-300 వరకు ఆత్మహత్యలు నమోదువుతున్నాయంటే ఆ తీవ్రతను అర్థం చేసుకోవచ్చు. ఈ నేపథ్యంలో ఆత్మహత్యల నివారణకు అవగాహన పెంచుకోవాలి. విలువైన ప్రాణం తీసుకుంటే వారిపై ఆధారపడిన వారి జీవితాలు ఎలా ప్రభావితం అవుతాయో తెలుసుకోవాల్సిన అవసరముంది.

భాగస్వామి: దంపతుల్లో ఏ ఒక్కరూ ఆత్మహత్య చేసుకున్నా బతికున్న వారికి సంక్లిష్ట పరిస్థితులు ఎదురవుతాయి. వారిపై అనుమానాలు, నిందలు మోపడం ఖాయం. సంతానం ఉంటే వారి పోషణ ఒక్కరే చూసుకోవాలి. సామాజిక, ఆర్థిక జీవనం దుర్భరంగా మారుతుంది. పిల్లలు పసిప్రాయంలో ఉంటే వారి సుదీర్ఘ కాల సంరక్షణ భారం ఒక్కరే మోయాల్సి వస్తుంది.

తల్లిదండ్రులు: పిల్లల సంరక్షణను చూసుకునే తల్లిదండ్రులు ఆత్మహత్య చేసుకుంటే ఆ కుటుంబం చిన్నాభిన్నమవుతుంది. ముఖ్యంగా పిల్లలకు మార్గదర్శనం చేసేవారు, శ్రద్ధ చూపేవారు ఉండరు. పసిపిల్లలైతే వారి సుదీర్ఘ జీవితకాలంలో తల్లీ లేదా తండ్రి అనుబంధాన్ని కోల్పోతారు. కష్టాలో ఓదార్పునివ్వడంలో తల్లిదండ్రులను మించిన వారుండరు.

తోబుట్టువులు: తోడబుట్టిన వారు బలవన్మరణానికి పాల్పడితే మధుర జ్ఞాపకాలను పంచుకునే వారు దూరమవుతారు. సుదీర్ఘకాలం పరస్పర రక్షణాధారం కోల్పోతారు. ఒంటరి భావన పెరుగుతుంది. భావోద్వేగాలు పంచుకోలేని పరిస్థితి. తోబుట్టువులుంటే కలిసి మెలిసి జీవించడానికి అస్కారముంటుంది.

బంధువులు: ఆత్మహత్య చేసుకున్నవారు బంధువుల్లో కీలకమైన వ్యక్తి కావొచ్చు. ఆ వ్యక్తిపైనే కొన్ని కుటుంబాల ఆశలు ఆధారపడి ఉంటాయి. ఒక్క వ్యక్తి మరణంతో ఆ బంధుత్వాలన్నీ చిన్నాభిన్నమై, బలగం బలహీనపడుతుంది.

ఆర్థిక వ్యవహారాలు: ఆత్మహత్యకు పాల్పడినప్పుడు చికిత్స కోసం అయ్యే ఖర్చులు, ఆత్మహత్యకు కారణమైన ఆర్థిక సమస్యలు ఇలా ఆ వ్యక్తి కుటుంబంపై భారం పడుతుంది. అప్పటికే ఇంట్లో ఆత్మీయులను కోల్పోయిన దుఃఖం ఒక వైపు ఆర్థిక సమస్యలు కుటుంబీకులను అతలాకుతలం చేస్తుంటాయి.

జిల్లాలో జరిగిన కొన్ని ఘటనలు

ఆత్మస్థైర్యాన్ని పెంపొందించుకోవాలి



నిరాశ, నిస్పృహలను దరి చేరనీయకుండా ఆత్మస్థైర్యం పెంపొందించాలి. అపజయాలు, అవమానాలను తట్టుకునేలా చిన్నప్పటి నుంచే సానుకూల దృక్పథాన్ని అలవాటు చేయాలి. ఒత్తిడి, కుంగుబాటులో ఉన్న వారిని వైద్య నిపుణుడికి చూపించాలి. కుటుంబంలో పరస్పరం అనుబంధాలు బలంగా ఉండటం, ఒకరి యోగక్షేమాలపై మరొకరు దృష్టి సారించాలి. –చాముండేశ్వరి, సైకాలజిస్టు, మదనపల్లె

ఎవరి పాలన మెరుగైందో ప్రజలు గుర్తిస్తారు

ఎమ్మెల్యే పెద్దిరెడ్డి ద్వారకనాథరెడ్డి



మొరుంపల్లెలో పర్యటిస్తున్న ఎమ్మెల్యే ద్వారకనాథరెడ్డి

బి.కొత్తకోట: ప్రజలకు ఎవరి పాలన మెరుగైందో వారే గుర్తిస్తారని ఎమ్మెల్యే పెద్దిరెడ్డి ద్వారకనాథరెడ్డి అన్నారు. శనివారం ఆయన బి.కొత్తకోట మండలం బయ్యప్పగారిపల్లె పంచాయతీ మొరుంపల్లెలో పర్యటించారు. పార్టీ నాయకులు, కార్యకర్తలు ఆయనకు ఘనస్వాగతం పలికి సత్కరించారు. వారితో సమావేశమైన పార్టీ పరిస్థితులు, చేపట్టాల్సిన చర్యలపై సమీక్షించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఐదేళ్ల వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో ప్రజలకు జరిగిన మేలు, అందిన సంక్షేమం, మెరుగైన పాలన, ఇంటి ముంగిటకే సేవలు అందించామని తెలిపారు. ఎలాంటి నిబంధనలు లేకుండా మాజీ సీఎం వైఎస్.జగన్‌మోహన్‌రెడ్డి సంక్షేమ పథకాలను అమలు చేశారని గుర్తుచేశారు. తంబళ్లపల్లె నియోజకవర్గంలో గడచిన 75 ఏళ్లలో జరగని అభివృద్ధి ఐదేళ్లలో చేశామన్నారు. మాజీ మంత్రి పెద్దిరెడ్డి, ఎంపీ మిథున్‌రెడ్డి సహకారంతో వేల కోట్ల నిధులు ఖర్చు చేశామని పేర్కొన్నారు.

అభివృద్ధి చరిత్రలో నిలుస్తుంది

ముదివేడు వద్ద రైతుల కోసం రూ.750 కోట్లతో రిజర్వాయర్ నిర్మాణం, రూ.1,217 కోట్లతో హంద్రీ-నీవా ప్రాజెక్టు పుంగనూరు ఉపకాలువ విస్తరణ పనులు, రూ.4,350 కోట్లతో గాలేరునగరి-హంద్రీనీవా ప్రాజెక్టుల అనుసంధానం, రూ.500 కోట్లతో రోడ్ల అభివృద్ధి, రూ.400 కోట్లతో వాటర్‌గ్రిడ్ పనులు, మురికినీటి కాలువ, సిమెంటు రోడ్లు, విద్య, వైద్యం, విద్యుత్ సరఫరా మెరుగు కోసం ఆరు విద్యుత్ సబ్‌స్టేషన్ల మంజూరు చేశామని ఎమ్మెల్యే గుర్తుచేశారు. తంబళ్లపల్లె ప్రజల చూపిన ఆదరణ మరచిపోలేమని, వారికి అభివృద్ధి ఫలాలు అందిస్తూ అండగా నిలుస్తామని భరోసా ఇచ్చారు. ఈ కార్యక్రమంలో సింగిల్‌విండో మాజీ చైర్మన్ గట్టు సురేష్‌రెడ్డి, సర్పంచులు నాగిరెడ్డి, జయరామిరెడ్డి, ఉమామహేశ్వరీ, ఎంపీటీసీ రామసుబ్బారెడ్డి, భీమగాని పద్మనాభరెడ్డి, రమణారెడ్డి, జీవి.రమణారెడ్డి, రంగారెడ్డి, బాలాజీరెడ్డి, వేణుగోపాల్‌రెడ్డి, గోపాలు, రెడ్డెప్పరెడ్డి, శివశంకర, మల్లికార్జునరెడ్డి పాల్గొన్నారు.

టమాటా బోర్డు ఏర్పాటు చేయాలి



మాట్లాడుతున్న రామిశెట్టి వెంకయ్య

మదనపల్లె : టమాటా రైతుకు గిట్టుబాటు ధర కల్పించేందుకు మదనపల్లెలో టమాటా బోర్డుతో పాటు ప్రభుత్వ ఆధ్వర్యంలో కోల్డ్‌స్టోరేజ్ ఏర్పాటు చేయాలని అఖిలభారత రైతు, కూలీ సంఘం రాష్ట్ర నాయకుడు రామిశెట్టి వెంకయ్య డిమాండ్ చేశారు. శనివారం ఏఐకేఎంఎస్ ఆధ్వర్యంలో పట్టణంలోని మామిడికాయల మండీలో జిల్లా నాయకుడు ఎండపల్లి వెంకటరమణ అధ్యక్షతన సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా రామిశెట్టి వెంకయ్య మాట్లాడుతూ టమాటా రేట్ల హెచ్చుతగ్గులతో రైతులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని, సీజన్‌తో సంబంధం లేకుండా గిట్టుబాటు ధర కిలో రూ.20గా నిర్ణయించాలన్నారు. దీనికి మార్కెటింగ్ అధికారులు, సబ్ కలెక్టర్ చొరవచూపాలన్నారు. టమాటాకు ప్రస్తుతం రేటు బాగానే ఉన్నప్పటికీ, పంట దిగుబడులు పెరిగినప్పుడు కనీస ధర లభించక రైతులు తీవ్రంగా నష్టపోతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. జిల్లా అధ్యక్షుడు ఉమాపతినాయుడు, ఆంజనేయులు, నారాయణ, నాగప్ప, వెంకటస్వామి, రామకృష్ణ, నారాయణ పాల్గొన్నారు.

మహాధర్నాను జయప్రదం చేయండి



పోస్టర్లు, కరపత్రాలు ఆవిష్కరిస్తున్న నాయకులు

మదనపల్లె : కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కులగణన చేపట్టాలని కోరుతూ ఈనెల 9న కాన్షీరామ్ వర్ధంతి సందర్భంగా విజయవాడ ధర్నాచౌక్‌లో బహుజన్ సమాజ్‌పార్టీ ఆధ్వర్యంలో మహాధర్నా చేస్తున్నట్లు ఆ పార్టీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు బండెల గౌతమ్‌కుమార్ తెలిపారు. శనివారం స్థానిక బీఎస్పీ కార్యాలయంలో మహాధర్నాకు సంబంధించిన పోస్టర్స్, కరపత్రాలను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా బండెల గౌతమ్‌కుమార్ మాట్లాడుతూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు రాష్ట్రంలో, దేశంలో కులగణన చేపట్టాలని, బీసీలకు వారి జనాభాదామాషా ప్రకారం పార్లమెంట్, అసెంబ్లీల్లో రిజర్వేషన్లు కల్పించాలన్నారు. ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో ఉన్న నామినేటెడ్ పదవులన్నింటిలోనూ బీసీలకు వారి జనాభా దామాషా ప్రకారం రిజర్వేషన్లు కల్పించాలనే అంశాలతో ఆంధ్రప్రదేశ్‌లో కుల జనగణన చేపట్టాలని డిమాండ్ చేస్తూ మహాధర్నా చేస్తున్నట్లు తెలిపారు.మహాధర్నాకు మదనపల్లె నియోజకవర్గం నుంచి పెద్దసంఖ్యలో ప్రజలు, బీసీ కులసంఘాలు, ప్రజాసంఘాలు తరలివచ్చి విజయవంతం చేయాలని కోరారు. కార్యక్రమంలో వాల్మీకిసంఘం రాష్ట్ర అధ్యక్షుడు పులిశ్రీనివాసులు, బీఎస్పీ నాయకులు రమణ, బాలాజీ, శ్రీనాథ్, గంగాధర్, లక్ష్మీపతి పాల్గొన్నారు.

నూతన పద్ధతులతో అధిక దిగుబడి

కలికిరి: నూతన వ్యవసాయ పద్ధతులతో రైతులు అధిక దిగుబడులు సాధించవచ్చని కేవీకే కో-ఆర్డినేటర్ డా. మంజుల అన్నారు. ప్రధానమంత్రి కిసాన్ సమ్మాన్ సమ్మేళన్ కార్యక్రమంలో భాగంగా 18వ విడత పంట సాయం విడుదల చేసిన సందర్భంగా శనివారం కేవీకే కార్యాలయంలో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ రైతులు పంటల సాగులో రసాయన ఎరువులు వాడకం తగ్గించి సేంద్రియ పద్ధతులు, సేంద్రియ ఎరువులను వినియోగిస్తే ఖర్చు తగ్గించుకోవడంతో పాటు అధిక దిగుబడులు పొందవచ్చని వివరించారు.

పారదర్శకంగా సర్వే నిర్వహించాలి

పీలేరు : ఫ్రీ హోల్డ్ భూముల సర్వే పారదర్శకంగా నిర్వహించాలని నియోజకవర్గ ప్రత్యేకాధికారిణి రమ అన్నారు. శనివారం స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో అధికారులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ సర్వేయర్లు, వీఆర్ఓలు క్షేత్ర స్థాయిలో సంబంధిత భూములను రికార్డుల ఆధారంగా క్షుణ్ణంగా సర్వే నిర్వహించాలని ఆదేశించారు. అనంతరం ఫ్రీ హోల్డ్ భూములకు సంబంధించిన రికార్డులు ఆమె పరిశీలించారు.

ఐటీ రంగానికి ఉజ్వల భవిష్యత్తు

కలకడ : ఐటీ రంగానికి ఉజ్వల భవిష్యత్తు ఉందని కలకడ ఆదర్శపాఠశాల ప్రిన్సిపాల్ మల్లంగ్‌షావల్లి తెలిపారు. ఆదర్శ పాఠశాలలో 10 రోజులు పాటు విద్యార్థులకు ఒకేషనల్ కోఆర్డినేటర్ ప్రతాప్, ఒకేషనల్ ట్రైనర్ విష్ణువర్ధన్ ఇంటర్న్‌షిప్‌కు సంబంధించి శిక్షణ ఇచ్చారు. 10 రోజుల పాటు శిక్షణ ఇస్తామని, విద్యార్థులు తమ పేర్లను నమోదు చేసుకోవాలని ప్రిన్సిపాల్ సూచించారు. ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

పంచాయతీ కార్యదర్శుల బదిలీలు

నిమ్మనపల్లె : నిమ్మనపల్లె మండలంలో పనిచేస్తున్న పలువురు పంచాయతీ కార్యదర్శులు బదిలీ అయినట్లు ఎంపీడీఓ రమేష్ బాబు తెలిపారు. శనివారం ఆయన మాట్లాడుతూ సాధారణ బదిలీల్లో భాగంగా నిమ్మనపల్లి మండలంలో పనిచేస్తున్న పంచాయతీ కార్యదర్శులు వెంకటరమణారెడ్డి వెంగంవారిపల్లె నుంచి నిమ్మనపల్లె-1కు, మారెప్ప రెడ్డివారిపల్లె నుంచి రాచవేటివారి పల్లెకు, యర్రమల్లయ్య నాయుడు రెడ్డివారిపల్లె-1 నుంచి వాల్మీకిపురం కూరపర్తికి, నాగమల్లి సామకోటవారి పల్లె నుంచి మదనపల్లి మండలం, బొమ్మనచెరువుకు, మంజుల అగ్రహారం నుంచి మదనపల్లి మండలం అంకిశెట్టిపల్లెకు బదిలీ అయ్యారని తెలిపారు. అలాగే రెడ్డమ్మ తవళం నుంచి రామసముద్రం మినికి బదిలీ కాగా , కలికిరి మండలం మర్రికుంటపల్లె నుంచి గాయత్రి రెడ్డివారిపల్లెకు, కలకడ మండలం కదిరాయ చెరువు నుంచి గౌతమి తవళంకు, మద్దినాయునిపల్లె నుంచి శ్రీనాథ్ అగ్రహారం పంచాయతీలకు బదిలీ చేస్తూ ఉన్నతాధికారుల నుంచి ఉత్తర్వులు అందాయని తెలిపారు. త్వరలో వీరంతా వారికి కేటాయించిన పంచాయతీల్లో బాధ్యతలు చేపడుతారని పేర్కొన్నారు.

కమనీయం.. కల్యాణం



శ్రీలక్ష్మీనరసింహుని కల్యాణోత్సవం నిర్వహిస్తున్న అర్చకులు

గుర్రంకొండ: మండలంలోని తరిగొండ గ్రామంలో వెలసిన శ్రీలక్ష్మీ నరసింహస్వామి వారి కల్యాణోత్సవం కన్నులపండువగా జరిగింది. శనివారం స్వాతి నక్షత్రం కావడం, ఇదేరోజు స్వామివారి జన్మదినం కావడంతో టీటీడీ ఆధ్వర్యంలో జయంతి వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా స్వామివారికి కల్యాణోత్సవం వైభవంగా నిర్వహించారు. ఆలయంలో చలువపందిళ్లు, పచ్చని తోరణాలతో పెళ్లివేదికను అందంగా అలంకరించారు. ముందుగా మూలవర్లకు అభిషేకాలు, అర్చనలు, ప్రత్యేక పూజలు నిర్వహించారు. వేకువజామునే స్వామివారికి క్షీరాభిషేకం నిర్వహించారు. పంచామృతాలకు ప్రత్యేకంగా మూలవర్లకు అభిషేకాలు కావించారు. వేదపండితులు మంత్రోచ్చారణల మధ్య మేళతాళాలతో శాస్త్రోక్తంగా మాంగల్యధారణ కావించారు. భక్తులు కల్యాణోత్సవంలో పాల్గొని స్వామివారిని సేవించుకొన్నారు. ఈ డిప్యూటీ ఏఈఓ మునిచందర్, సూపరింటెండెంట్ ధనంజయులు అర్చకులు పాల్గొన్నారు.

తహసీల్దార్ కార్యాలయం తనిఖీ



రామసముద్రం తహసీల్దార్ కార్యాలయంలో తనిఖీ చేస్తున్న సబ్ కలెక్టర్

రామసముద్రం: రామసముద్రం మండల తహసీల్దార్ కార్యాలయాన్ని మదనపల్లె సబ్ కలెక్టర్ వై.మేఘ స్వరూప్ శనివారం రాత్రి ఆకస్మికంగా తనిఖీ చేశారు. 22 ఎ, ఫ్రీహోల్డ్ భూములకు సంబంధించి మినికి, కురిజల, నారిగానిపల్లె పంచాయతీల భూములకు సంబంధించిన రికార్డులను పరిశీలించారు. కార్యాలయానికి సంబంధించిన వివరాలను తహసీల్దార్ నిర్మలా దేవిని అడిగి తెలుసుకుని భద్రపరిచిన రికార్డులను పరిశీలించారు. అంతకు ముందు మండలంలోని కాపల్లెలో పంచాయతీ లో సర్వే నంబర్ 146లో 58 సెంట్లకు సంబంధించి ల్యాండ్ కన్వెన్షన్ భూమిని పరిశీలించారు. మండలంలోని కమ్మవారిపల్లె కు చెందిన ఓ రైతు తనకు సంబంధించి సర్వేనంబర్ 101,/7 లో 1.36 సెంట్ భూమిలో 36 సెంట్లు అన్యాక్రాంతం అయ్యిందని సబ్ కలెక్టర్ ఫిర్యాదు చేశారు. ఈ విషయంపై సబ్ కలెక్టర్ సంబంధించిన వీఆర్వోను వివరణ కోరగా ఆ భూమి పై ఇరుపక్షాలు కోర్టుకు వెళ్లారని తెలిపారు.

డైవర్షన్ పాలిటిక్స్ తప్ప అభివృద్ధి శూన్యం

మదనపల్లె : రాష్ట్రంలోని కూటమి ప్రభుత్వం నాలుగునెలల పాలనలో డైవర్షన్ పాలిటిక్స్ తప్ప చేసిన అభివృద్ధి శూన్యమని డీసీసీ అధ్యక్షులు గాజుల భాస్కర్ విమర్శించారు. శనివారం స్థానిక కాంగ్రెస్ కార్యాలయంలో ఏర్పాటుచేసిన సమావేశంలో గాజులభాస్కర్ మాట్లాడుతూ ముఖ్యమంత్రి చంద్రబాబు ఎన్నికల ముందు ప్రకటించిన సూపర్‌సిక్స్ పథకాల్లో కేవలం ఒక పథకాన్ని ప్రవేశపెట్టారని, మిగిలిన 5 పెండింగ్‌లో ఉన్నాయన్నారు. మాజీ డీసీసీ అధ్యక్షుడు అల్లాబక్షు, నాయకులు చెన్నకేశవులు, రాష్ట్ర మహిళా ఉపాధ్యక్షురాలు మీనాకుమారి, ముబారక్‌ఖాన్, ఖాదర్‌బాషా, సోమశేఖర్, శరత్ కుమార్‌రెడ్డి పాల్గొన్నారు.

గుర్రంకొండ: కాంగ్రెస్ కార్యకర్తలు ప్రజా సమస్యలపై నిత్యం పోరాటం చేయాలని జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు గాజుల భాస్కర్ పిలుపునిచ్చారు. శనివారం స్థానిక కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ సమస్యల పోరాటంతోనే ప్రజల్లో కాంగ్రెస్ పార్టీకి గుర్తింపు వస్తుందని పేర్కొన్నారు.

జననీ.. శివకామిని.. జయశుభ కారిణి

శరన్నవరాత్రులు ప్రారంభమైనాయి. దుర్గమ్మ తొలి రోజు శ్రీ బాలా త్రిపురసుందరీ దేవి అవతారంలో.. రెండో రోజు గాయత్రీ దేవి అవతారంలో భక్తులకు దర్శనమిచ్చారు. ఇక ముచ్చటగా మూడోరోజు.. అంటే శనివారం అమ్మలగన్నయమ్మ.. ముగ్గురమ్మల మూలపుటమ్మ.. దుర్గమ్మ శ్రీఅన్నపూర్ణాదేవి అవతారంలో భక్తులకు దర్శనమిచ్చారు. సమస్త జీవకోటికి ప్రాణాధారమైన ఆహారాన్ని అందించే దేవతగా శ్రీ అన్నపూర్ణదేవిని భక్తులు కొలుస్తారు.



మదనపల్లె సిటీ: అన్నపూర్ణాదేవి అలంకారంలో వాసవీమాత



గుర్రంకొండ: అన్నపూర్ణాదేవి అలంకారంలో దర్శనమిచ్చిన గంగమ్మతల్లి



కలకడ: చంద్రఘంటాదేవి అలంకరణలో ప్రత్యేక పూజలు అందుకున్న చౌడేశ్వరిదేవి



వాల్మీకిపురం: అన్నపూర్ణాదేవి అలంకరణలో దర్శనమిస్తున్న నల్లవీర గంగాభవాని



అన్నపూర్ణాదేవి : వైష్ణవిదేవి అలంకరణలో దర్శనమిస్తున్న కామేశ్వరి



పీలేరు : అన్నపూర్ణాదేవి అలంకరణలో కన్యకాపరమేశ్వరి

ఫుట్‌బాల్ జట్టు ఎంపిక

మదనపల్లె : పట్టణంలోని జెడ్పీహైస్కూల్‌లో శనివారం నిర్వహించిన జిల్లా పురుషుల ఫుట్‌బాల్ పోటీల్లో ప్రతిభ కనపరిచిన క్రీడాకారులతో అన్నమయ్య జిల్లా పురుషుల ఫుట్‌బాల్ జట్టును ఎంపిక చేసినట్లు జిల్లా సంఘం అధ్యక్షుడు, కార్యదర్శులు దిలీప్‌కుమార్, మురళీధర్ తెలిపారు. శనివారం వారు మీడియాతో మాట్లాడుతూ ఫుట్‌బాల్ పోటీలకు మొత్తం 35మంది సభ్యులు హాజరు కాగా, అందులో ఉత్తమ ప్రదర్శన కనపరిచిన 22 మంది సభ్యులను ఎంపిక చేశామన్నారు. వీరు ఈ నెల 8 నుంచి 11 వరకు గుంటూరు జిల్లా నాగార్జున యూనివర్శిటీలో జరిగే రాష్ట్ర ఛాంపియన్‌షిప్ పోటీల్లో పాల్గొంటారని తెలిపారు. అన్నమయ్య జిల్లా పురుషుల ఫుట్‌బాల్ జట్టుకు టీమ్ కెప్టెన్‌గా మహేంద్రనాయక్, కోచ్‌గా విజయ్, మేనేజర్‌గా ఉదయ్‌కుమార్‌ను నియమించినట్లు తెలిపారు. కార్యక్రమంలో సీనియర్ ప్లేయర్స్ హరి, నరి, అబ్దుల్లా పాల్గొన్నారు.

చట్టాలపై అవగాహన పెంచుకోవాలి

పీలేరురూరల్ : సమాజంలో మహిళలు చట్టాలపై అవగాహన పెంచుకోవాలని జిల్లా 11వ అదనపు జడ్జి ఎ. మహేష్ అన్నారు. శనివారం మండలంలోని తలపుల గ్రామ సచివాలయంలో న్యాయ సేవాధికార సంస్థ ఆధ్వర్యంలో విధాన్ సే సమాధాన్‌లో భాగంగా మహిళలకు న్యాయ విజ్ఞాన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా జడ్జి మాట్లాడుతూ గ్రామీణ మహిళలు చట్టాలపై అవగాహన పెంచుకుని ఆత్మస్థైర్యంతో తమను తాము రక్షించుకుని ముందుకు పోవాలన్నారు.

ఆర్టీసీ ప్రాంగణంలో అభివృద్ధి పనులు

కలకడ : కలకడ ఆర్టీసీ బస్టాండ్ ప్రాంగణంలో శనివారం అధికారులు అభివృద్ధి పనులు ప్రారంభించారు. ఏడాది క్రితం జిల్లా జాయింట్ కలెక్టర్‌కు ఆర్టీసీ ప్రాంగణాన్ని అభివృద్ధి చేయాలని స్థానికులు కోరారు. ప్రయాణికులకు మంచినీరు, మరుగుదొడ్లు సౌకర్యం కల్పించాలని అనేకమార్లు అధికారులను కోరిన పట్టించుకోలేదు. అయితే శనివారం ఆర్టీసీ అధికారులు పనులు ప్రారంభించారు. మరుగుదొడ్లు, మంచినీటిని ఏర్పాటు చేసి, మిగులు నిధులతో మంచినీటి మోటార్‌ను వినియోగంలోకి తెచ్చేందుకు కృషి చేస్తామని బస్టాండ్ అభివృద్ధి అథారిటి పర్యవేక్షకుడు చంగల సిద్ధనాగులు తెలిపారు.